క్లుప్తంగా

కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటాం

నాగలాపురం: మండలంలోని ప్రజలు, కార్యకర్తలకు అండగా ఉంటామని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. ఆదివారం నాగలాపురం మండల పరిధిలోని జగనన్న కాలనీలో వైఎస్ఆర్ సీపీ కార్యకర్త అశోక్ ఓ ప్రైవేటు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, సీనియర్ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, మహేష్ రెడ్డి, శ్యామ్, జగదీష్ రెడ్డి, మోహన్ మొదలియార్, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు వరాల జల్లు



ముస్లింలతో భేటీ అయిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముస్లింలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. శ్రీకాళహస్తి ముస్లిం మతపెద్దలు ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలిసి సన్మానించి బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల వద్దకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈద్గాల వద్ద శుభ్రపరచడం, నీటి వసతి ఏర్పాటు చేయాలని పురపాలకసంఘ అధికారులను ఆదేశించారు. ఈద్గాల వద్ద షామియానాల ఏర్పాటుకు ఖర్చులను వెంటనే విడుదల చేయాలని కమిషనర్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈద్గాలు, క్లీనింగ్, షాదీ మహల్స్ మరమ్మతులు, ఈద్గాల వద్ద సుందరీకరణ, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరించి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ బీఎస్ అక్రమ్, గవర్నమెంట్ ఖాజీ షరీఫ్, అంజాద్‌బాషా, నూరుల్లా, ఖలీల్‌సాహెబ్, ఉమర్, హమీద్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న చంద్రప్ప

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆదివారం తిరుపతి పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆయన తిరుమల శ్రీవారి శేషవస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మంత్రి సత్యకుమార్‌కు సన్మానం

రాష్ట్రమంత్రిగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్ తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. ఆయనను తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప రేణిగుంట విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసి శ్రీవారి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ప్రతిపక్ష పార్టీలపై దాడులు మంచిది కాదు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నాయకులపై అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలు దాడులు చేయడం మంచిది కాదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ సంయుక్తంగా ఏర్పాటైన ఎన్‌డీఏ కూటమి ద్వారా 164 సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. అనేక నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రానీయమంటూ దాడి చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్య దేశంలో మంచిది కాదని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

చలువ పందిరి దగ్ధం



తిరుపతి మంగళం : తిరుపతి– కరకంబాడి మార్గం చెన్నాయిగుంట సమీపంలోని తెలుగుగంగ పంప్ హౌస్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి దగ్ధమైంది. టీ స్టాల్ నిర్వాహకుడు గిరీష్ కథనం మేరకు.. శనివారం రాత్రి 9 గంటలకు దుకాణం మూసివేసామని, అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో చలువ పందిరికి మంటలు అంటుకుంది. స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. రెండు రోజుల క్రితమే కస్టమర్ల సౌకర్యార్థం పందిరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు తెలిపాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టవాటిల్లినట్లు బాధితుడు వెల్లడించాడు.

ప్రజలకు చేరువగా తపాలా డాక్ పే

- డిజిటల్ లావాదేవీలు పెంచే దిశగా యాప్
- గూగుల్ పే, ఫోన్ పేలకు దీటుగా రూపకల్పన
- డాక్ పే లావాదేవీలపై గ్రీవెన్స్ వెసులుబాటు
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 155299



డాక్ పే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లోగో

నారాయణవనం: దేశంలో డిజిటల్ లావాదేవీలను పెంచే దిశగా తపాలా శాఖ వినియోగదారులకు పలురకాల సేవలను అందించడంలో ఆసక్తి చూపుతోంది. ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, కొరియర్, స్పీడ్ పోస్టలతో పాటు ప్రైవేటు సంస్థలకు దీటుగా బ్యాంకింగ్, గోల్డ్ బాండ్, బీమా తదితర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మరో అడుగు ముందుకేసి డిజిటల్ లావాదేవీల పెంపునకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల మాదిరిగా డాక్ పే అనే యాప్‌ను 2021లోనే దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు దీన్ని ప్రజలకు చేరువ చేసే దిశగా దూసుకెళుతోంది. ఈ డాక్ పే ద్వారా ప్రజలు డిజిటల్ ఫైనాన్స్ సేవలు పొందడంతోపాటు ఇండియా పోస్టు, ఐపీపీబీ అందించే బ్యాంకింగ్ సేవల విషయమై సాయం పొందవచ్చు. డబ్బు పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, డిజిటల్ రూపంలో వ్యాపారులకు నగదు చెల్లించడంలాంటి పనులను చక్కబెట్టుకోవచ్చు. ప్రతి భారతీయుడి అవసరాలను తీర్చేలా డాక్ పేను రూపొందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో యూపీఐ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా దీనిని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తున్నారు. ఈ యాప్‌ను ఏబ్యాంకు ఖాతాదారుడైనా వినియోగించవచ్చు.

గ్రీవెన్స్ వెసులుబాటు

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంలో నగదు లావాదేవీల్లో ఏవైనా పొరపాట్లు చోటు చేసుకుంటే ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వాటి కార్యాలయాలు మనకు అందుబాటులో ఉండవు. అయితే డాక్ పే యాప్ ద్వారా నగదు బదిలీ సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఫిర్యాదుల స్వీకరణకు తపాలా శాఖ వెసులుబాటు కల్పించింది. డాక్ పే అనే యాప్ తపాలాశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పని చేస్తుండడంతో మన డబ్బుకు గ్యారెంటీ ఉంటుంది. యాప్ గురించిన సమగ్ర సమాచారం కోసం ఐపీపీబీ టోల్ ఫ్రీ నంబర్ 155299ను వినియోగదారులు సంప్రదించ వచ్చని తపాలా శాఖ అధికారులు చెబుతున్నారు.

డాక్ పేతో సురక్షితం



ప్రైవేట్ యూపీఐ యాప్‌లకు దీటుగా కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా తీసుకొచ్చిన డాక్ పే యాప్ చాలా సురక్షితమైనది. మీరు జరిపే లావాదేవీలకు రక్షణ ఉంటుంది. ఏదైనా కారణాలతో ఇబ్బందులు ఎదురైతే గ్రీవెన్స్ సెల్‌తో పాటు టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులో ఉంటుంది. ఏ బ్యాంకు ఖాతాకైనా డాక్ పేతో డిజిటల్ లావాదేవీలను జరుపుకోవచ్చు. ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉంది.

– నరసింహ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్, పుత్తూరు.

పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు



పచ్చాలమ్మ దేవతను దర్శించుకుంటున్న ఎంపీ గురుమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామదేవత పచ్చాలమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు, పచ్చాలమ్మ కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టారు. పచ్చాలమ్మ దేవత విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేసి, పూలతో అలంకరించారు. భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నిరంజన్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పచ్చాలమ్మ సేవలో తిరుపతి ఎంపీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామ దేవత పచ్చాలమ్మ దేవతను ఆదివారం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు వైఎస్ఆర్ సీపీ నాయకుడు నూకతోటి రాజేష్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.





పచ్చాలమ్మ దేవతకు పూజలు, పొంగళ్లు పెడుతున్న భక్తులు

సురేష్ మృతి తీరని లోటు



సురేష్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి, నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు తొండా సురేష్ మృతి పార్టీకి తీరని లోటని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం రాచర్లలోని సురేష్ ఇంటి వద్ద నిర్వహించిన ఆదరణ కూడిక (కర్మక్రియలు) కార్యక్రమానికి వారు హాజరయ్యారు. మృతి చెందిన సురేష్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్మిక విభాగం మాజీ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, సీనియర్ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మండల ప్రచార కమిటీ కన్వీనర్ చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, మండల కన్వీనర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, పార్టీ నేతలు భూషణం, గిరిప్రసాద్, రమేష్, ప్రతాప్, మాధవయ్య, మహేంద్ర, శోభన్ యాదవ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రామాపురం దళితవాడ వాసి గంధం సుబ్రమణ్యంకు చెందిన ట్రాక్టర్ చోరీకి గురైనట్లు బాధితుడు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. శనివారం అర్ధరాత్రి తాము ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి నకిలీ తాళాలతో ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసుకుని తీసుకెళ్లిపోయారని, శబ్దం రావడంతో లేచి చూసే లోపు ట్రాక్టర్ తోలుకుని వారు పరారైనట్లు బాధితుడు వాపోయాడు. చోరీకి పాల్పడిన వారిలో గ్రామ సమీపంలోని అబ్బాబట్లపల్లికి చెందిన వారు ఉన్నట్లు తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాంటీన్ తెరిపించరూ...!



మూతబడిన ఎయిర్‌పోర్ట్ క్యాంటీన్

రేణిగుంట: రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో ఉన్న ఓ క్యాంటీన్, నిర్వాహకుల ఆదరణ లేక మూడున్నరేళ్లుగా మూతబడి ఉంది. టెర్మినల్ ఎదురుగా ఉన్న ఈ క్యాంటీన్‌లో సామాన్యులకు అందుబాటులో ఆహారం లభించేది. రాజకీయ ప్రముఖులకు, వీవీఐపీలకు స్వాగతం పలికేందుకు వచ్చే కార్యకర్తలు, పోలీసు సిబ్బంది, విమానాశ్రయ సిబ్బంది కూడా ఈ క్యాంటీన్‌లోనే ఆహార, పానీయాలను తీసుకునేవారు. అయితే మూడున్నరేళ్ల కిందట కరోనా వల్ల క్యాంటీన్ నిర్వహణ భారంగా మారడంతో నిర్వాహకుడు మూసేశాడు. ఆ తర్వాత క్యాంటీన్ నిర్వహణ కోసం ఎవరూ ముందుకు రాలేదు. విమానాశ్రయం వద్దే ఓ చిన్నపాటి క్యాంటీన్ ఉంది. కానీ అక్కడ ధరలు అధికంగా ఉండడంతో చాలామంది రేణిగుంటలోని పలు హోటళ్లకు వెళ్తున్నారు. క్యాంటీన్ మూతతో విమానాశ్రయానికి కూడా నెలసరి అద్దె రాకుండా ఆదాయానికి గండి పడుతోంది. క్యాంటీన్ నిర్వహించేందుకు ఎవరైనా ముందుకొస్తే రీఓపెన్ చేస్తామని ఎయిర్‌పోర్ట్ అధికారులు చెబుతున్నారు.

ఉమామహేశ్వరునికి మండల పూజలు



ఉమామహేశ్వరస్వామి ఆలయంలో హోమ పూజలు

- 108 శంఖాలతో అభిషేక పూజలు
- హోమ పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు



ఆలయంలో కలశ పూజలు

సత్యవేడు: మండలంలోని ఇరుగుళంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మండల పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలం(48రోజులు) చివరి రోజు పూజలను రుత్వికులు బాలాజీ శర్మ, సురేష్‌కుమార్ బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉగంటలకు విఘ్నేశ్వర పూజతో ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కలశపూజ, హోమం పూజల్లో ఆలయ ధర్మకర్త సుశీల్‌కుమార్‌రెడ్డి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. స్వామివారికి 108 శంఖాలతో కలశ పూజ నిర్వహించి, ఆభరణాలతో అలంకరించారు. భక్తులు, ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ద్రౌపదీదేవి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆదివారం పూజలు చేశారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ ఆలయానికి వెళ్లి అర్చనలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురవారెడ్డి, న్యాయవాది తిరుమలరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు మునిరత్నంరెడ్డి, త్యాగరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం







విశేష అలంకరణలో అమ్మవారు, అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అగ్నిగుండాన్ని పెద్దకొయ్యలు వేసి అంటించారు. అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కంకణాలు ధరించి, పసుపు దుస్తులు ధరించి స్నానాలు ఆచరించి గోవిందనామ స్మరణతో క్యూలైన్లలో నిలబడ్డారు. పోతురాజుతో పాటు అమ్మవారి ఉత్సవమూర్తిని అగ్నిగుండం వద్దకు తీసుకుని వెళ్లారు. అమ్మవారి పైట చెరుగులో నిప్పులు మూటకట్టారు. ముందుగా ఆలయ పూజారి పూల చెండును అగ్నిగుండంలో వేసి ప్రవేశించారు. అనంతరం గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

రుయాలో కుక్కల బెడద



పేదలకు ఆరోగ్య దేవాలయంగా పేరుగాంచిన రుయా ఆసుపత్రిలో కుక్కలు వీరంగం చేస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతో అవస్థలు పడి పేద రోగులు, వారి సహాయకులు రోజూ రుయా ఆసుపత్రికి చేరుకుంటున్నారు. అయితే రుయా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, జనరల్ వార్డ్ తదితర ప్రాంతాల్లో కుక్కలు తిరుగుతున్నాయి. రోగులు, వారి సహాయకులు, డాక్టర్ల, నర్సులు వెంట పడుతున్నాయి. అయితే సంబంధిత అధికారులు సిబ్బంది వాటిని వెళ్ళగొట్టే చర్యలు చేపట్టకపోవడంతో ఆస్పత్రిలో ఇబ్బందులు తప్పడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పేదల ఆస్పత్రిలో తాగునీటి కష్టాలు



రాయలసీమకి తలమానికమైన శ్రీవెంకటేశ్వర రుయా ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దాతల సహాయంతో జల ప్రసాదం ద్వారా తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈ జల ప్రసాదంలో తాగునీరు సరిగ్గా రాకపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారు దాహార్తితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాహానికి పక్కనే ఉన్న దుకాణాల్లో డబ్బులు పెట్టి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం జల ప్రసాదం వద్ద రోగుల సహాయకులు క్యూలో నిలబడి తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో ప్రతి చోటా కనీస అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

స్ట్రెచర్ కష్టాలు



రుయా ఆసుపత్రికి అత్యవసర చికిత్స కోసం వచ్చేవారు నడవలేని పరిస్థితి ఉంటారు. వారిని వార్డుకు స్ట్రెచర్‌పై తీసుకు వెళుతుంటారు. అయితే ఆ స్ట్రెచర్‌పై ఒక వైపు రోగి మరోవైపు ఆసుపత్రికి సంబంధించిన పరికరాలను తీసుకువెళ్లే పరిస్థితి దాపురించింది. ఈ దృశ్యం రుయాలో ఆదివారం కనిపించింది. లేవలేని స్థితిలో ఉన్న రోగిని ఇలా స్ట్రెచర్‌పై కూర్చోబెట్టి తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పేదల ఇళ్లు కూల్చడం సరికాదు







కూల్చి వేతలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: రాజీవ్‌నగర్‌లో పేదల ఇళ్లను కూల్చడం సరికాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు అన్నారు. ఆదివారం ఆయన రాజీవ్‌నగర్‌లోని అధికారులు కూల్చిన కట్టడాల వద్దకు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పోలీసులు బందోబస్తు మధ్య శనివారం జేసీబీల సాయంతో పలు కట్టడాలను కూల్చి వేశారన్నారు. ఈ ప్రాంతంలో చాలామంది ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటూ వ్యాపారాల నిమిత్తం దుకాణాలు నిర్మించుకుని ఉన్నారన్నారు. వీరంతా పేదవారని తెలిపారు. పేదలు ఎంతో ఖర్చు పెట్టి నిర్మించుకున్నారని తెలిపారు. అనాధీనం అయినా పట్టాలు లేకపోయినా ఎమ్మెల్యే వారిని సంప్రదించి న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చింది కదా అని వాటిని కూలదోయడం మంచి పద్ధతి కాదన్నారు. కక్షపూరితంగా వ్యవహరించకుండా న్యాయపరంగా పోవాలని, ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలని ఆయన కోరారు.